క్లుప్తంగా

గజలక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారు



నందిగామ: పట్టణంలోని మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న శ్రీశుక శ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో మూడో రోజైన బుధవారం స్వామివారికి పలు రకాల విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారిని గజలక్ష్మిగా అలంకరించి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. సాయంంత్రం వేళ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.రాత్రివేళ స్వామివారిని శేషవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ట



దేచుపాలెం(వత్సవాయి) : గ్రామంలో వేంచేసియున్న శ్రీ ఆంజనేయస్వామివారి నూతన దేవాలయ విగ్రహయంత్ర, జీవధ్వజ పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. అర్చకులు అయనకు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తిరుమలగిరి ఆలయ చైర్మన్ కొమరగిరి రవీంద్రభరద్వాజ్, సర్పంచి బొల్లం నారాయణప్రసాద్, పతకమూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరా కేంద్రం పరిశీలన



నందిగామ: పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని తెలిపారు. పట్టణ ప్రజలకు తాగునీరు అందిస్తున్న ప్రధాన రక్షిత మంచినీటి సరఫరా కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. పట్టణ ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి వివరాలతోపాటు నీటి నాణ్యత శాతాన్ని పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లో నిత్యం తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణ వాసులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వివరించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఏఈ ఫణి శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

డేరంగుల అరుణకు సేవావజ్ర అవార్డు



చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని బలుసుపాడుకు చెందిన వలంటీర్ డేరంగుల అరుణ సేవావజ్ర అవార్డుకు ఎంపికైనట్లు ఎంపీడీవో రమేష్‌బాబు బుధవారం తెలిపారు. వలంటీర్ ఆదూరి పరిమళలత (గౌరవరం), సయ్యద్ రసూల్ (బండిపాలెం), షేక్ ఆరీఫ్ (చిల్లకల్లు–3), పిట్టల లత (బలుసుపాడు), లాహోరి ధనలక్ష్మి (జయంతిపురం) సేవారత్న అవార్డుకు ఎంపికైనట్లు ఎంపీడీవో వివరించారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా గురువారం వీరికి ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను చేతుల మీదుగా అవార్డులు, నగదు బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.

నేడు వలంటీర్లకు వందనం కార్యక్రమం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని వలంటీర్లకు వందనం కార్యక్రమం గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గురువారం ఉదయం పదిగంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఉదయభాను కార్యాలయ ప్రతినిధి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు చిల్లకల్లులోని మండల పరిషత్‌కార్యాలయంలో పేట మండలంలోని వలంటీర్లను సత్కరించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే, విప్ సామినేని ఉదయభాను ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు.

వలంటీర్ వ్యవస్థతో పారదర్శక పాలన

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



చందర్లపాడులో వలంటీర్‌కు అవార్డు అందజేసి సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): దేశచరిత్రలో ఏరాష్ట్రంలో లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా లంచాలు, వివక్షకు తావులేని పారదర్శక పాలనకు నాంది పలికారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కొనియాడారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా చందర్లపాడు మండలంలోని వలంటీర్లకు బుధవారం ఆయన సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులను అందించి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటివరకు రూ.2.55లక్షల కోట్లను ప్రజలకు అందించారని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మాదిరే గతటీడీపీ హయాంలోనూ రాష్ట్రబడ్జెట్ ఇదేస్థాయిలో ఉన్నప్పటికీ లక్షలాది కోట్లను ఆనాడు చంద్రబాబు ప్రజలకు ఎందుకు అందించలేదో ప్రజలు గమనించాలని కోరారు. చంద్రబాబు పాలనలో ఏర్పాటు చేసిన జన్మభూమి కమిటీలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే, సీఎం జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లు ప్రజల ఇంటిముంగిటనే పథకాలు అందిస్తున్నారన్నారు. వలంటీర్లు అందిస్తున్న సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా వారికి అవార్డులు అందించి సత్కరిస్తున్నారని వివరించారు. ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, సర్పంచి కస్తాల పున్నమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, బుగ్గినేని సురేష్, కొమ్మినేని మహేంద్ర, వలంటీర్లు పాల్గొన్నారు.



ముప్పాళ్లలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

రూ.33లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీలు...

చందర్లపాడు(నందిగామ టౌన్): మండలంలోని ముప్పాళ్లలో రూ.33లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్లు, సీసీ డ్రైన్‌ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామీణ ప్రాంతాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని అంతర్గత రహదారులను సిమెంట్‌రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రోడ్లకు ఇరువైపులా డ్రైన్‌లు నిర్మించి మురుగు నీటి పారుదల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నాణత్య పాటించడంతోపాటు త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆయా అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులు, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. నాయకులు నల్లాని సాయి, బండారుపల్లి కపిల్, నల్లాని అయ్యన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉదయభాను

జగ్గయ్యపేట: ప్రజల సంక్షేమ పథకాలతోపాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తోందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, విప్ సామినేని ఉదయభాను తెలిపారు. స్థానిక ముక్త్యాల రోడ్డులోని వరదరాజులుస్వామి ఆలయ సమీపంలో రూ.13లక్షలతో నిర్మించే కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ సీఎం జగనన్న నాలుగేళ్ల తొమ్మిదినెలల పాలనలో సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందించడమే కాకుండా గ్రామాలు, పట్టణాలను అభివృద్ధి చేసిందని వివరించారు. ముఖ్యంగా బీసీల కోసం నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. త్వరితగతిన భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంబాబు, జాన్‌మియా, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉదయభానును కలిసిన వేల్పుల..



ప్రభుత్వవిప్ ఉదయభానును సత్కరిస్తున్న వేల్పుల రవికుమార్ దంపతులు

పెనుగంచిప్రోలు: రాష్ట్ర నూతన పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ(నెడ్‌కాప్) కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పెనుగంచిప్రోలుకు చెందిన వేల్పుల రవికుమార్ దంపతులు, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానును బుధవారం విజయవాడలో కలిసి ఘనంగా సత్కరించారు. తన నియామకానికి సహకరించారంటూ రవికుమార్, విప్ ఉదయభానుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ నెడ్‌కాప్ చైర్మన్‌గా సమర్థంగా పనిచేసి రాష్ట్రప్రభుత్వానికి మరింత మంచిపేరు తీసుకురావాలని వేల్పుల రవికుమార్‌కు సూచించారు.

రవికుమార్‌కు అభినందనలు..

నెడ్‌కాప్ చైర్మన్‌గా నియమితులైన రవికుమార్‌కు పెనుగంచిప్రోలు మండలంతోపాటు నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంతో ప్రాధాన్యతనిస్తోందని, అందులో భాగంగానే ఎస్సీ సామాజికవర్గానికి చెందిన తనకు రాష్ట్రస్థాయి చైర్మన్ పదవి లభించిందంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, సీఎం జగనన్న వీరాభిమానిగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించినప్పటి నుంచి పార్టీ అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని వివరించారు. తాడేపల్లిలోని నెడ్‌కాప్ కార్యాలయంలో గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు రవికుమార్ వివరించారు.

జగ్గయ్యపేట అభివృద్ధికి పెద్దపీట

మున్సిపల్ చైర్మన్ రాఘువేంద్ర



టిడ్కో గృహాల విషయంలో వాదులాడుకుంటున్న కౌన్సిలర్ రామలక్ష్మి, వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న చైర్మన్ రాఘువేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: మున్సిపాలిటీ పరిధిలో వృధా ఖర్చులను తగ్గించుకుని ఆదాయాన్ని పెంచుకుంటూ తద్వారా జగ్గయ్యపేట పట్టణ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి కృషిచేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. స్థానిక పురపాలక సంఘ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో 2023–24 సవరించిన బడ్జెట్, 2024–25 వార్షిక బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ తమ కౌన్సిల్ ఏర్పడిన రెండున్నరేళ్ల వ్యవధిలో రూ 27.27కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం గర్వకారణమన్నారు. ఇది 41ఏళ్ల మున్సిపాలిటీ చరిత్రలోనే ఓ రికార్డుగా అభివర్ణించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెవెన్యూ వసూళ్లు రూ.13.47కోట్లుగాను, రెవెన్యూ ఖర్చులు రూ.11.09కోట్లుగాను మొత్తం వసూళ్లు రూ.20.74కోట్లుగాను, ఖర్చులు రూ.18.16కోట్లుగాను అంచనా వేశారు. బడ్జెట్‌లో మొత్తం మిగులు రూ.2.59కోట్లుగా పేర్కొన్నారు. వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ 31వవార్డు విష్ణుప్రియనగర్‌లో 150 అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరించడంపై హర్షం వ్యక్తంచేస్తూ విప్ సామినేని ఉదయభాను, చైర్మన్ రాఘవేంద్రకు కౌన్సిల్ తరపున అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. జెండాస్తూపం వద్ద ప్రస్తుత కౌన్సిల్ సభ్యుల పేర్లతో కూడిన బోర్డు ఏర్పాటు చేయాలని ప్రతిపక్ష సభ్యుడు సైదేశ్వరరావు కోరగా, తప్పకుండా ఏర్పాట్లు చేస్తామని చైర్మన్ రాఘవేంద్ర హామీ ఇచ్చారు. టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఎప్పుడు అప్పగిస్తారని ప్రతిపక్ష టీడీపీ సభ్యురాలు కన్నెబోయిన రామలక్ష్మి ప్రశ్నించగా, గృహాల వద్ద మౌలిక సదుపాయాల ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయని చైర్మన్ బదులిచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్నందునే ఇప్పుడు హడావుడిగా పనులు మొదలుపెట్టారని ప్రతిక్ష సభ్యులు రామలక్ష్మి, పేరం సైదేశ్వరరావు, వెంకట్ అనడంతో ఈ ప్రక్రియను విప్ సామినేని ఉదయభాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మొదలుపెట్టారని చైర్మన్ గుర్తుచేశారు. కావాలనే టీడ్కో ఇళ్లను నిర్లక్ష్యం చేశారని ప్రతిపక్ష సభ్యులు విమర్శించగా, తమరి నిర్వాకం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని పాలకవర్గ సభ్యులు పందుల రోశయ్య, ఖాదర్ బాబు, తుమ్మల ప్రభాకర్ ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో టిడ్కో గృహాలకు భూములు ఇచ్చిన రైతులకు రూ.3.5కోట్లు, నిర్మాణ పనులు చేపట్టిన ఎల్‌అండ్‌టీ సంస్థకు రూ.45కోట్లు బకాయిలు పెట్టగా, సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఆ నిధులకు వారికి చెల్లించేలా కృషిచేసిన ఘనత ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకే దక్కుతుందని పాలకపక్ష సభ్యులు గట్టిగా బదులిచ్చారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు మిన్నకుండిపోయారు. కౌన్సిలర్లు పందుల రోశయ్య, సుందరమ్మ, కాశి అనురాధ, ఖాదర్‌బాబు, గీతారాణి తదితరులు ఆయా సమస్యలను ప్రస్తావించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని చైర్మన్ వారికి హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను ఆశీర్వదించాలి




మోగులూరులో ప్రభుత్వ పథకాల క్యాలెండర్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

మోగులూరు(కంచికచర్ల): అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు కోరారు. మండలంలోని మోగులూరులో బుధవారం ఆయన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించడంతోపాటు వారి యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరును ఆరా తీశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు సీఎం జగన్ ప్రభుత్వంలోనే మేలులు జరుగుతున్నాయన్నారు. నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం కోసం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీని మరోసారి ప్రజలు గెలిపించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను రాజకీయాలతీతంగా అమలుచేస్తూ, అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, సర్పంచి షేక్ మొహిద్దీన్ బీ, ఎంపీటీసీ సభ్యులు ఆవుల సామ్రాజ్యం, గ్రామ పార్టీ కన్వీనర్ బండి సూరిబాబు, మాజీ సర్పంచి షేక్ హుస్సేన్, బండి తిరుపతిరావు, బండి అప్పారావు, రాయల నరహరి, షేక్ రసూల్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వీఆర్వో శ్రీలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలతో మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో భారతీయ రైల్వే 'అమృత్ భారత్ స్టేషన్' పథకం అందుబాటులోకి తీసుకొచ్చింది. అందులో భాగంగా ఈ నెల 26న విజయవాడ డివిజన్‌లోని గుణదల రైల్వేస్టేషన్‌ను దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేయనున్నారు. ఈనేపథ్యంలో '2047 విక్షిత్ భారత్ విక్షిత్ రైల్వేస్' థీమ్‌తో నగరంలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు బుధవారం పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో మొదటి స్థానంలో ఎ.శ్రీహాస్, రెండోస్థానంలో ఎం.ప్రవీణ్, మూడోస్థానంలో జె.ప్రభుకుమార్ నిలిచారు. వీరికి ఈనెల 26న బహుమతులు అందజేయనున్నారు.

పెద్ద తిరునాళ్లకు సకల ఏర్పాట్లు



సిద్ధమవుతున్న కల్యాణ వేదిక



లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేస్తున్న ఆలయ సిబ్బంది



భక్తులు కూర్చొనేందుకు చేపట్టిన ఏర్పాట్లు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి కల్యాణ మహోత్సవాల(పెద్ద తిరునాళ్ల)కు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణం చూసేందుకు వీఐపీ పాస్‌లు ఏర్పాటు చేయడంతోపాటు రూ.200ల టికెట్లు 1000 సిద్ధంగా ఉంచుతున్నామని ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో కె.రమేష్‌నాయుడు బుధవారం తెలిపారు. కల్యాణాన్ని భక్తిచానల్ ద్వారా శుక్రవారం రాత్రి కల్యాణం జరిగే సమయంలో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు వారు వివరించారు. కల్యాణం రోజున మునేరు అవతల ఆడిటోరియంలో దీక్ష విరమించిన స్వాములతోపాటు 20వేల మందికి పైగా భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచే భక్తులకు భోజనం అందుబాటులో ఉండేలా తగు చర్యలు చేపట్టారు. ఐదు రోజుల పాటు ఆలయం వద్ద అంబులెన్స్, మెడికల్ క్యాంప్‌తోపాటు ఫైర్ ఇంజిన్ అందుబాటులా ఉండేలా ఏర్పాట్లు చేశారు. స్వాములు సేద తీరేందుకు గ్రామంలోని దేవాలయాల్లో టెంట్లు ఏర్పాటు చేశారు. భక్తులకు 1.50 లక్షల లడ్డూ ప్రసాదాలను సిద్ధంగా ఉంచుతున్నట్లు ఈవో తెలిపారు. కల్యాణం పూర్తయిన తరువాత అమ్మవారి తలంబ్రాలు భక్తులకు పంపిణీ చేస్తామని, ఆలయ అధికారులకు అందరూ సహకరించాలని కోరారు.

సొంతగూటికి చేరిన కొండ సాయిరాం



జగ్గయ్యపేట అర్బన్: ఇటీవల టీడీపీలో చేరిన 13వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కొండ సాయిరాం(లోకల్ సాయి) తిరిగి బుధవారం సొంతగూటికి చేరారు. స్థానిక ముక్త్యాల రోడ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉదయభాను ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ వారి మోసపూరిత మాటలు నమ్మి ఆపార్టీలో చేరిన సాయిరాం, ఆ పార్టీ విధానాలు నచ్చక తిరిగి వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు.

24న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ 24వ తేదీన జరగనుంది. పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం తెల్లవారుజామున 5–55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభం కానుంది. ఆది దంపతులైన శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్లు ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై కొలువై తీరగా, భక్తులు, దీక్షాదారులు, ఆలయ అధికారులు, సిబ్బంది, సేవా సిబ్బంది పాల్గొంటారు. అమ్మవారి ఘాట్‌రోడ్డు నుంచి ప్రారంభమయ్యే గిరి ప్రదక్షిణ కుమ్మరిపాలెం, విద్యాధరపురం, సితారా జంక్షన్, కబేళా, పాల ప్రాజెక్టు, చిట్టినగర్, కేటీ రోడ్డు, శ్రీనివాసమహాల్, బ్రహ్మణ వీధి, రథం సెంటర్ మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంటుంది. భక్తులందరూ పాల్గొనాలని ఆలయ అధికారులు కోరారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

నందిగామ: మండలంలోని పల్లగిరి, రామిరెడ్డిపల్లి గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. నందిగామలోని కెవిఆర్ కళాశాలలో మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ లగడపాటి సంగయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నేడు ధ్వజస్థంభ ప్రతిష్ట



వీఅన్నవరం(వీరులపాడు): మండలంలోని వీఅన్నవరం వేంచేసియున్న ఆంజనేయ స్వామి వారి జీవధ్వజ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు శోభాయమానంగా సాగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా బుధవారం గణపతిపూజ, శాంతిపఠనం, వేదపారాయణ, పుణ్యాహవచనం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ప్రతిష్ఠించనున్న జీవధ్వజ స్థంభానికి గ్రామస్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వల్లాపురి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ గురువారం ఉదయం 11.47 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూజల్లో సర్పంచి జమ్ముల వరబాబు, మాజీ సర్పంచి శేషగిరిరావు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

242 మందికి వైద్యపరీక్షలు



జగ్గయ్యపేట అర్బన్: పేద ప్రజల వద్దకే వెళ్లి, వారికి నాణ్యమైన వైద్యసేవలందించాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక రెండో సచివాలయం వద్ద జరిగిన బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్, ఇతర వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్యసేవలందించారు. ఈసందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రజల వద్దకే వెళ్లి నాణ్యమైన వైద్య సేవలను అందించే వినూత్నమైన కార్యక్రమం జగనన్న ఆరోగ్య సురక్ష అని కొనియాడారు. మొత్తం 242 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.